# 'కాలమహాత్మ్యము'

శ్రీమతి ఆచంట సత్యవతమ్మగారు

బొబ్బర్లంకలా కప్పుడే దాటింది పడవ. ఎగుమతి దిగుమతులకొఱకును, కళాసుల మార్పుకొఱకును ప్రయాణికుల క్షుత్తునివారణకొఱకు నందొక గంటకాలము పడవలను కట్టివైతురు. గట్టుననున్న కాఫీహోటల్సు జనులతో క్రిక్కిఱిసియుండెను. కాఫీ యుప్మాలతో కడుపులు నింపికొనిన ప్రయాణీకులలో కొందరు బస్సులెక్కిరి. కొందరు పడవ నధిరోహించిరి.

సాయంకాల మారుగంట లగుసరికి, అన్నపుమూటలతో ప్రయాణీకుల నెక్కిండను తొందరలతో నా యాపడవల కళాసులొచ్చి త్రాడును లాగఁ జొచ్చిరి. పెరుగుపెరుగని గొల్లెతలు కేకవిడుచుండిరి. మినపరొట్టె, తాలింపుసెనగలని కోమట్లరచుచుండిరి. చుట్ట బీడి సిగరెట్లగ్గిపెట్లని అరటిపళ్లని కొందఱమ్ముచుండిరి. చెట్లపైదూకు కొండముచ్చుల సందడింతంతకాదు.

ఇంతలో పదునారుసంవత్సరముల బాలుఁడొకఁడు పరుగుపరుగున రొజుకొనుచు, పడవ నాపండోయి అని కేకలిడుచు గట్టుదరినే వచ్చుచుండెను. వీని ఆదుర్దాగాంచినవెనుక పడవసరంగాతని నందెక్కించుకొనెను. ఆబాలుఁడాసరంగున కివ్వవలసిన కేవు చెల్లించి హోలునందొకచోఁ గూర్చుండెను. వానిముఖ మేలకో వినుగు వైరాగ్యముల సూచించుచుండెను. క్రీడాలీలల కునికిపట్టగు నంత బాల్యావస్థలో నాతని కంత చింతెందులకో!

ప్రవాహవేగము నోరిసికొనుచు క్రమక్రమముగా రేవురేవున నెక్కిదిగెడు జనముతో, ఎగుమతి దిగుమతుల సరుకుల ఖాళీ పూటులనొందుచు పడవ సాగిపోవుచుండెను. గదులలోని చంటిపిల్ల లేడ్చుచుండిరి. నిద్రకళ్ళతో పిల్ల లిల్లే యనుకుని గబగబనడచి నీటిలోఁ బడెదరేమోయని తల్లు లదరించుచుండిరి. హోలునందలి వివిధవర్ణ మనుజుల వింతవింత ప్రసంగములతో, నవ్వులతో నిట్టే రాత్రి తొమ్మిది గంటలయ్యెను.

అది మాఘమాసము. శిశిరలక్ష్మి, దినములు బాగుండని అలంకారరహిత ముత్తైదువువలె, పత్రపుష్పవిహీనయై మోడువారి, విదేశాగమన మొనరింపఁబోయిన నాథునిరాక కెదురుచూచుచుండిన సతీతిలకమువలె, చూతఫలసమన్వితుఁడగు వసంతుని రాక కెదురుచూచుచుండెను. నిర్మలాకాశమున చంద్రుఁడతి మనోహరముగా ప్రకాశించుచుండెను. పడవలలోని ప్రయాణీకు లుల్లాసముగా నాపండువెన్నెలలో నొకరి చరిత్ర లొకరడిగి తెలిసికొనుచు కాలక్షేపము చేయుచుండిరి. సంభాషణలలో మన బాలుని వంతువచ్చెను.

"ఏ మబ్బాయీ, ఆటలాడుకొనుచు నుల్లాసమున గడపవలసిన నీ విట్లతిచింతాక్రాంతుఁడవై యుంటి"వని, యొకవృద్ధుఁడు ప్రశ్నించెను. చెప్పుట కిష్టము లేకపోయినను నలుగురి బలవంతమున తప్పని సరిచే, తన దీనచరిత్ర నీవిధముగా నేకరువుఁబెట్టెను. అందరతి నిశ్శబ్దముగా వినుచుండిరి. పడవ యొకటే వేగమున జరజర పోవుచుండెను. వెన్నెల వెలుగులో నదిలోని చేపల పట్టుటకై తీ,తీ,యను కూతలతో, తీతువుపులుగులు వినువీధిని యెగురుచుండెను. వాటి కఠోరశబ్దముల కందరు, గోపాలకృష్ణుని, రేపల్లెవాడను తలఁచుకొనుచుండిరి. బాలుఁడు తన కథ సాగించ మొదలిడెను.

"మేము నియోగిశాఖనుఁ జెందిన బ్రాహ్మణులము. నెల్లూరు ప్రాంతమందలి యొక కుగ్రామము మా కాపురస్థలము. మాతండ్రి మొదట పెద్ద యీనాందారుఁడే కాని, యొక కారణాంతరమున యావదాస్తియు, నొక బంధువున కామీపెట్టి కోల్పో

యెను. అప్పుచేసి మాఅక్క పెండ్లిఁ జేసి చరాస్తియగు వెండిబంగారములు పోగొట్టుకొనెను. ఈ బెంగచే మతిచెడి, కొన్నాళ్లు తిరిగి, రోగగ్రస్తుఁడై తుదకు చనిపోయెను. ఇట్టి దీనావస్థలో చిన్నవాఁడనగు నన్నును, మాఅమ్మను, మాఅక్క తనింటికిఁ దీసికొనిపోయెను.

తదాదిగా మాయునికి నిష్టపడని మాభావకు ధుమధుమలు, రుసరుసలు యెక్కువై, వాటి పర్యవసానము మాఅక్కగారికి దెబ్బలురూపంగా పరిణమించెను. అది చూడలేక పోయినను, మాకు వేరుపాధి దారిలేనందున, లోలోనకుందుచు, అక్కడనే కాలము గడపుచుంటిమి. నాకు పిత్రార్జితపు కరిణికమొకటి యున్నది కాని, నేను మేజరగువఱ కది రాదు. ఇంక రెండేండ్లవఱ కీ తీరు తిప్పలు తప్పవని రోజులు వెళ్ళబుచ్చుచుంటిమి. మాబావకు కోపము రాకుండా తటాలున చెప్పినపనులు నేను చేయుచుంటిని. రెండువేళల వంట మొదలగు సమస్త కృత్యములును, మాఅమ్మ చేయుచుండెను. మాఅమ్మ దీనావస్థను చూడలేకను, మగని కోపమున కాగలేకను, వెనుక గొయ్యి, ముందు నూయివలె, మధ్య మాఅక్క నలుగుచుండెను.

మాబావగా రొక బోర్డుమెంబరు. ఆస్తిపరుఁడే కాని, తగని దుర్వ్యయుఁడు. తర్చు పనులమీద చెన్నపట్నం వెళ్ళుచుండుటలో గుఱ్ఱపుపందెముల వెఱ్ఱిలో మునిగి, వేలకువేలోడుచు వట్టిచేతులతో నింటికి వచ్చుచుండెను. ఆ తిక్కచే నింటిలో ఆలు తేలుఁవలె కనబడుచుండును కాబోలును, ప్రహరణములు మాఅక్కకు నేదో సాకున తగులుచుండెడివి. వీరిమీద వారిమీదఁ బెట్టి తిట్లు మాకు సంభవించుచుండెడివి. మనిషికున్నది పుష్టియు, పసరానికి తిన్నది పుష్టియునన్న సామెత రిత్తయగునా? అందులో డబ్బు చేతిలో లేని పురుషుఁ డగ్నిజ్వాలతో సమానము. ఈవిధమున యావదాస్తియు స్వయంకృతాపరాధమునఁ బోగొట్టుకొనెను. మాఅక్క యైదువేల రూపాయిల నగలకి, తాళిమాత్రం మిగిలెను. ఇంటెడు పాత్రసామానుల కొక బిందెయు, రెండు గిన్నెలును, గరిటెయు మిగిలెను. ఇంతలో మాబావకి ప్రారబ్ధకర్మఫలమోయన హఠాత్తుగా పక్షవాతమొచ్చి చనిపోయెను. ఇప్పుడు మాఅమ్మే కాకుండ మాఅక్కకూడ నాపాలఁబడెను. వారి నెట్లు పోషించగలను!

ఒక్కగా నొక్క కొడుకగుటచే గలిగిన ప్రేమ గారాబముల నన్నెక్కువగా మావారలు చదివించలేదు. అల్లరివాఁడనై, చెట్లెక్కి చామలెక్కి, పొలాన షికార్లుఁదిరిగి, మొద్దాబ్బాయినై తిరిగి నే చెడితిని. సర్వపరీక్ష మాత్ర మేకళనుండెనో నాకు బోధించి, మాబావ చదివించి ప్యాసుఁజేయించెను. మొదటినుఁడియు పరులను చేయిజాచని పరువుగల కుటుంబమగుటచే, నీచవృత్తియగు, యాచన చేత కాదు. ఎమ్.ఎ. బియ్యేలకే లేని యుద్యోగములు నాకెవరిచ్చెదరు? పోనీ యొకరింట వఁటపనులు చేసుకొనుట కభిమానము. చింత చచ్చినను పులుపు చావదుకదా?

ఇన్నియు శోధించి. ఏ రాజమహేంద్రవరమంటి పట్నములోనో ఉదారులుంచిన, బీద విద్యార్థుల ఫండ్లు నిధులునుండునని యెంచి, యాత్రస్టీలను బ్రతిమాలి వారిచ్చు ధనముతో చదువుకొందమని బయలుదేరితిని. నాకంటె ముందే నాపెద్దమ్మ ఆకోశాధికారులచేతుల కడ్డము నిలచెను. వారివారి బంధువర్గమే, యాస్థానము లాక్రమించుటచేతను, నాకై తగిన సిఫారసు లొసగువారు లేనందునను, నా కా యోగము పట్టదయ్యెను. దేవుఁడు వరమిచ్చినా పూజారి వరమియ్యఁడనుట కిదే తార్కాణము. బీద విద్యార్థుల నిధులను పేర్లునూ, భాగ్యవంతుల మొగమాటస్తుల కందు ప్రవేశమున్నూ. హిందూసమాజములనుటయు, పరదేశ, భాషాక్రీడల కందు ప్రావీణ్యమునూ. చూచితిరా మన పరిస్థితులు, మన స్థితులు, దుస్థితులుగా మారినను, మనము మారలేదు. పులగము

మీద పప్పువలె, మెరకనీరు పల్లమునకే యన్నట్లు, గొప్పవారికే విందులు; బీదవారు, గొప్పవారికే సంతర్పణలు. ఇఁక బీదలకు బాధలే. ఇంతలో మా తల్లి నాయనా అక్కను చూచుచుండుమని చెప్పి, యొకనా డెవరికిని, చెప్పకుండ నెచ్చటికో వెడలి పోయెను. ఆమె యెచ్చట నేవిధముగా బాధపడు చుండెనోయని, పదిహేనురోజులుగా మాఅక్క నేను నర్థభుక్తితో కాలము బుచ్చుచు విచారించు చుంటిమి. నిన్ననే మాతల్లివద్దనుండి నాకొక జాబు వచ్చెను. "బిడ్డల యాకలిబాధ చూడఁజాలక, పూవులమ్మిన యూరనే కట్టెలమ్మలేక, కాని గ్రామములో కడుపు కక్కుర్తికై, కాయకష్టములు బడి, మీకింత యుపాధిఁగల్గించు తలంపున నీముమ్మిడి వరగ్రామమున నొక యుద్యోగియింట వంటఁజేయ కుదిరితిని. నెలకు పదిరూకలవేతనమొసగ నిర్ణయము. నీమైనార్టీ తీరి నీకు కరిణీకపు భాగ్యము సమకూడువఱ కిట్లనే కాలముగడిపి, మీయాకలు లణచెదను. ఈ జాబందిన తక్షణమే నీవు బయలుదేరి రావలెను. రెండునెలల జీత మడ్వాన్సుగాఁ దీసికొంటిని. అవి గొంపోయి, మరల నేను పంపువర కట్లనో గౌరవ కాలక్షేపము చేయుచురుగాఁక"యని వ్రాసినది. అదిఁ జూచియే నేనిట్లామె సన్నిధి కేగు చుంటిని. అంత బ్రతుకు బ్రతికిన మాఅమ్మ యిట్లొరుల పంచల సైరంధ్రిగాఁ జేరవలసివచ్చెనే యన్న దిగులు హృదయము బీటలువారఁ జేయుచున్న"దని, పైనిఁ జెప్పజాలక దుఃఖ మణచుకొనుచుండెను.

బాలుని చరిత్ర కందున్నవారందరు దుఃఖించి, యూరడించిరి. "నుదుటన్ వ్రాసినవ్రాలు తప్ప గలదా నూరేండ్లు చింతించినన్" అన్న ట్లిప్పటి కేగతో తప్పునా !

"అందులో నీ డిప్రషన్ రోజులలో, పాదుషాలే పకీరులైరి. ఎంతెంత ఘనకుటుంబములో చితికినవి. రైతియ్యక, పన్నులు తప్పక, యీనాందార్లు మట్టుమై"రని యొకరనిరి. అంతలో నొక ఛాందసుఁ డందికొని, "యివన్నీ యూరికే వచ్చినవా ? కలియుగ కలుషములని, అందుచే నల్పాయువులని, కృతయుగంలో వ్యాసులవారే యన్నారు. వర్ణధర్మము లడుగంటినవి. మహా పతివ్రతలచే ఖండఖండాంతరముల వన్నెవాసుల కెక్కిన మనదేశము స్త్రీలు, విడాకులచట్ట తీర్మానామోదము లొనరించుచుండిరి. శారదాబిల్లని ప్రౌఢవివాహములొచ్చి, వర్ణాంతర శాఖేతర పరులను వరించి, తలిదండ్రులను ధిక్కరించు చున్నారు కన్యలు. అపస్వరయుక్తముగ శూద్రులు వేదములు పఠించుచున్నారు. బ్రాహ్మణయువకులు, హూణవిద్యాఫలితముగా, నానాజాతి హస్తపదార్థములను, హోటళ్ళలో స్నాన సంధ్యాద్యనుష్ఠానము లనేమరి మడిమైలలు లేకుండగా నపరిశుద్ధ వాయు భూతాధికమగు పాయఖానాల కేగిన బట్టలతోడను, సకల రోగోత్పత్తినిఁ గలిగించు క్రిమిసంయుత ధూళి రేగుచున్న బజారులందు సంచరించిన వస్త్రముల తోడను, పాదప్రక్షాళనమైన సేయక భుజించు చున్నారు. ఆదిశంకరులుంచిన వర్ణవృత్తుల విసర్జించి, బ్రాహ్మణుఁడు వ్యవసాయము వర్తకము చేయుచున్నాఁడు. కంసాలి, వడ్రంగి పని చేయుచున్నాడు. కాపుద్యోగ మొనరించుచున్నాఁడు. వైశ్యుఁ డుపాధ్యాయ, వకీలువృత్తు లవలంబించుచున్నాఁడు. క్షత్రియులు, వ్యవసాయ, భట్రాజులుగా మారిరి. దేవాంగి నేతమాని, జోలెత్తుకొనుచుండెను. గొల్లఁడు పాలు పెరుగులు మాని, కసాయివానికి మేకల నమ్ముకొను చున్నాఁడు.

ఈలాగు నాజగద్గురు నిర్దిష్టనియమముల మేర మీరుటచేతనే నానావిధ రోగములు, అకాల మరణములు, అల్పాయువులు, నిత్యదారిద్ర్యములు, భూకంపములు మొదలగు దేశారిష్టము లుద్భవించుచున్నవి.

స్త్రీలు నాగరికాగ్రేసరు లగుటచే, నుదయాస్తమయములు కన్నబిడ్డల దాదుల యొడులం బడవైచి, నేదో నెపంబున వీధి షికార్లు చేయుచున్నారు. విద్యావిహీనులగు దాదు లొసగు మలినపదార్థ భక్షణ సేయుచు, తల్లులకొఱకు కడు పుబ్బునటుల నేడ్చు

పసినినుగుల పాట్లా పరమాత్ముడే యాలించవలె కాని, ప్రత్యక్ష దైవమగు తల్లి వినిపించుకొనదు. శిశు ఆహారముగా భగవంతునిచే నిర్మించిన స్తన్యపాన మొసగని నాగరికాగ్రగణ్య జనులు గూడ గలరన్న కలియుగ కలుషములుఁ గాక మరేమి? మహాలక్ష్మి పూజలు మరచినారు. కండ్లు నులుము కొనుచునే కాఫీగిన్నెలు మూతి కంటించుకొన నభ్యాసపడిన హిందూ స్త్రీల కిక, యుపవాస వ్రత నియమము లెక్కడ? స్త్రీలు పురుష వివక్షత లేకుండగాఁ కాలేజీలలో విద్యాపఠనము చేయుచున్నప్పుడిఁక శీలగ్రహణ మేది? అన్నిధర్మము లంతరించి పాపము పండుచున్నది. భూదేవి పాప భరము భరించలేనప్పుడే ప్రళయము సంభవమగు"నని సనాతనుఁడనెను.

"ఏమిటండీ, ఎల్లకాల మొక్కరీతినే ధర్మము సాగునా, పూర్వము మన హిందూమత మొక్కటే గనుక, మన మాడినమాట చెల్లినది. ఇప్పుడన్ననో, ఎడపెడ పలుమతములు బయలుదేరి మనచే నీచాతినీచముగా చూడబడుచున్న దేశ సోదరుల నాదరించుటచే నిరాదరణాగ్నిని మ్రగ్గనేరని జాతు లితరమతముల నీడను తలదాచుకొనుచున్నారు. సంఘము క్షీణించుటచే విడివడిన వెంటి ననుకరించు మన మధఃపతనమగు నవస్థను వచ్చుటచే మహానీయులు కొందరు ప్రస్తుతపుస్థితి తొలగింప శాస్త్ర వాదనల కొంతకాల మెడముంచి, కాలానుసారము మనోబుద్ధులు మార్చుకొనుఁడని ప్రబోధించుచున్నా" రని స్వానుభవశాలి యొకరనిరి.

ఇట్టి తర్కవితర్కములతో తెల్లవారెను. ఎవరి స్థానముల వారు దిగిరి. మనబాలుఁ డాతని తల్లి చెంత కరిగెను. తరువాత పాట్లా పరమాత్మ నిర్దేశానుసారమగును.

---

## పిచ్చికల్లాలు

శ్రీమతి తులసీ లక్ష్మణగారు

తటిపివెన్నెలపచ్చి కెరటాల లేచిపొం
గులువారు పాలబుగ్గలను నులిమి
బంగారుపోత నిబ్బరమూని మెరయుగుం
డ్రని చిట్టిచేతులల్లన గ్రహించి,
మెలమెల్లఁదప్పటడ్గులు వేయఁగాఁదీసి
వ్యత్యస్తపాదాల వంకఁజూచి,
చిఱుబొజ్జమీఁదుగాఁజేర్చి చేతులు ప్రేమ
బట్టఁబైకెత్తి దోఁబూచులాడి,
చంకనిడికొని మనసార, చౌకళించు
శిరముమూర్కొని కన్నులఁజేర్చికొనుచు
నన్నులాలించినట్టి నన్గన్నతల్లిఁ
బిచ్చికల్లాలు మాయమ్మఁ బిలిచికొందు.

---

## కొండవీడు

శ్రీమతి కర్లపాలెం రాజ్యలక్ష్మమ్మగారు

రమణీయముగనుండు రాజమందిరములు
శిథిలమై గూబల జేరదీసె
ఉరుపుష్పఫలశోభితోద్యానవనములు
సర్పరాజముల కాశ్రయములయ్యె
స్త్రీలు జలకమాడు శృంగారసరసుల
జ్వరదాయకంబగు జలమునిండె
సైన్యసంతతినివాసంబయి యలరారు
బురుజులు గబ్బిలంబులను జేర్చె
కోటవాకిళ్లు శిథిలమై కూలిపోయె
అశ్వగజశాలలన్నియు నడగిపోయె
మేటిపట్టణమగు కొండవీటియందు
ఘోర విధివశమున కసాధ్యంబుకలదే!!